పేదల పోరుబాటకు 15 ఏళ్లు

- తోటగరువు కొండపై నివాసాల కోసం రెండేళ్లు పోరాడిన బడుగులు
- అండగా నిలిచిన సీపీఎం నాయకులు


సీపీఎం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్)


భూ పోరాట సమయంలో చీరలు, టార్పాన్లతో తోటగరువు కొండపై పేదలు వేసుకున్న హద్దులు (ఫైల్)

ఆరిలోవ: తోటగరువులో సీపీఎం చేపట్టిన భూపోరాటానికి 15 ఏళ్లు నిండాయి. పేదలకు నిలువ నీడ కల్పించడం కోసం సీపీఎం నాయకులు భూ పోరాటం చేపట్టారు. ఈ పోరాటం జరిగి ఈనెల 23వ తేదీకి 15 ఏళ్లు పూర్తి కావడంతో సీపీఎం నాయకులు ఇక్కడ ఉత్సవాలు కూడా నిర్వహించారు. వీళ్ల పోరాటంతో ప్రస్తుతం సుమారు 700 కుటుంబాలు ఈ కొండపై తలదాచుకుంటున్నాయి. ఈ పోరాటంలో సీపీఎం నాయకులు పోలీసులతో లాఠీ దెబ్బలు తిన్నారు, కొందరు జైల్‌కు వెళ్లారు. అయినా భయపడకుండా పోరాటం కొనసాగించి పేదల గూళ్లు నిలబెట్టారు.

- ఆరిలోవ ప్రాంతం తోటగరువు వద్ద ఉన్న కొండపై పేదల ఇళ్ల కోసం 2008 ఆగస్టు 23న నగరంలో సీపీఎం నాయకులు ఆరిలోవ జోన్ నాయకులతో కలిసి భూ పోరాటం చేపట్టారు. ఆరిలోవలో సొంత ఇళ్లు లేని పేదలతో పాటు నగరంలో వెంకోజీపాలెం, ఇసుకతోట, మద్దిలపాలెం, మధురవాడ, ఎండాడ, సింహాచలం, అడవివరం, వేపగుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పేదలు ఇక్కడ పాకలు వేశారు. కొందరు చీరలు, టార్పాన్లతో గుడారుల మాదిరిగా హద్దులు వేసుకున్నారు. ఇంకొందరు తాటి కమ్మలతో చిన్నచిన్న పాకలు వేశారు. రెవెన్యూ ఉన్నతాధికారులు పోలీసు బందోబస్తుతో పలుమార్లు వాటిని తొలగించేశారు. ఎన్నిసార్లు తొలగించినప్పటికీ పట్టు వీడకుండా పేదలచే పాకలు వేయిస్తుండేవారు. రెండుసార్లు పోలీసులు ఇక్కడ ఆక్రమణలను తొలగించి కమ్మలకు నిప్పంటించారు. ఈ పోరాటంలో ప్రధాన పాత్ర పోషించిన 23 మంది సీపీఎం నాయకులను పోలీసులు అరెస్టు చేసి సెంట్రల్ జైల్‌కు పంపించారు. అయినా పోరాటం ఆగకుండా కొనసాగించారు. ఇలా పూర్తిస్థాయిలో ఇక్కడ నివాసాలు నిలవడానికి సుమారు రెండు సంవత్సరాలు కృషి చేశారు. చివరికి ఇక్కడ నివాసాలు నిలిచాయి. అప్పటి వరకు ఉన్న బోడి కొండ నివాసాలతో నిండిపోయింది. అధికారులు అక్కడ ఇళ్లకు పట్టాలు ఇచ్చారు. కరెంట్, నీటి సరఫరా, అవసరమైన చోట్ల కొండ పైకి రోడ్లు, మెట్ల మార్గాలు ఏర్పాటు చేశారు. ఇంటి పన్నులు సైతం వేశారు. దీంతో 700 నివాసాలతో ఈ కొండ నిండిపోయింది. ఈ పోరాటంలో సీపీఎం నగర నాయకులతో పాటు అప్పట్లో కేంద్ర, రాష్ట్ర నాయకులు పి.మధు, సీహెచ్ నర్సింగరావు, ఎస్.పుణ్యవతి, ఎంవీఎస్ శర్మ చేయి కలిపారు.

బీఎస్‌ఆర్‌నగర్‌గా నామకరణం..

నగరంలో కంచరపాలెం ప్రాంతానికి చెందిన సీపీఎం నాయకుడు బొట్టా నర్సింగరావు సీపీఎంలో సేవలు అందించారు. సీపీఎం చేపట్టిన వివిధ పోరాటాలలో ఆయన చురుగ్గా పాల్గొనేవారు. ఆయన అనారోగ్యంతో తోటగరువు భూ పోరాటానికి కొన్నాళ్ల ముందే మరణించారు. పేదల కోసం పోరాడిన నాయకుడిగా గుర్తించి ఆయన జ్ఞాపకార్థం సీపీఎం నాయకులు భూపోరాటం ద్వారా సాధించిన తోటగరువు కొండకు బీఎస్ఆర్ నగర్‌గా నామకరణం చేశారు. అప్పట్లో జీవీఎంసీ 36వ వార్డు సీపీఎం కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ (బొట్టా నర్సింగరావు భార్య) జీవీఎంసీ నిధులతో ఇక్కడ పేదల తాగునీటి కోసం బోరింగ్ ఏర్పాటు చేశారు.

పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలి..



భూ పోరాట సమయంలో నేను ఇక్కడ గూడు సంపాదించుకున్నాను. ప్రస్తుతం ఇక్కడే నివాసముంటున్నాను. కొండపై భాగంలో ఉన్నవారికి ఇప్పటికీ తాగునీటి సమస్య పూర్తిగా తీరలేదు. వారి ఇళ్లకు ఇంటి పన్నులు వేయలేదు. ఇక్కడ సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి.
–ఎస్.నగేష్, బీఎస్ఆర్ నగర్

గూడు నిలిచింది..



సీపీఎం చేపట్టిన భూ పోరాటంతో మా కుటుంబానికి సొంత ఇల్లు లభించింది. చిన్న అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకునేవాళ్లం. పోరాటంలో నేను కూడా సీపీఎం నాయకులతో చేయి కలిపాను. పోలీసులు అరెస్టు చేశారు. ఇళ్లు నిలుస్తాయో లేదోనని ఒక్కోసారి భయపడేవాళ్లం. –గౌరి, బీఎస్ఆర్ నగర్

పట్టు వదలకుండా పోరాడాం..



పేదల కోసం 2008 అక్టోబరు 23న భూ పోరాటం ప్రారంభించాం. పలు పార్టీలకు చెందిన స్థానిక నాయకులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు మమ్మల్ని భయపెట్టే వా రు. ఈ పోరాటంలో నాతో సహా 23 మంది సీపీఎం నాయకులను పోలీసులు జైల్లో పెట్టారు. అయినా పోరాటం కొనసాగించాం. పోరాట ఫలితంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా సుమారు 700 మంది పేదలు ఇక్కడ సొంత నివా సాలు ఏర్పాటు చేసుకున్నారు.
– ఆర్‌కేఎస్‌వీ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

క్లుప్తంగా

వినోద్‌కుమార్‌కు డాక్టరేట్


ఉత్తర్వులు స్వీకరిస్తున్న వినోద్‌కుమార్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయ విద్యా విభాగం పరిశోధక విద్యార్థి దిరిశాల వినోద్‌కుమార్‌కు ఏయూ డాక్టరేట్ లభించింది. అంబేడ్కర్ విశ్వ విదాయలయం ఉప కుపలతి ఆచార్య నిమ్మ వెంకటరావు, ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు సంయుక్త పర్యవేక్షణలో 'ఏన్ అసెస్‌మెంట్ ఆఫ్ లెర్నింగ్ డిఫికల్టీస్ ఇన్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఆఫ్ తెలుగు మీడియం స్టూడెంట్స్ ఎట్ సెకండరీ లెవెల్ ఇన్ కృష్ణా డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి నుంచి శనివారం వినోద్‌కుమార్ డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు.

29న మెగా రక్తదాన శిబిరం

ఎంవీపీకాలనీ: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాంక్‌ఫిట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు మహేష్, టి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఉదయం 8 గంటల నుంచి ఏయూలోని జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశాఖ డీసీపీ విద్యాసాగర్ నాయుడు ముఖ్య అతిథిగా, ఏయూ క్రీడా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ గౌరవ అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల యువత ఈ శిబిరంలో పాల్గొనాలని కోరారు.

సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ


సీపీఎం సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిలపాలెం: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నిరసిస్తూ ప్రభుత్వాలపై సమరభేరి మోగించనున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పితాపురంకాలనీలో గల పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈనెల 30,31 తేదీల్లో పాదయాత్రలు, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద ధర్నా, 3వ తేదీన నిరుద్యోగ యూత్ మార్చ్, 4వ తేదీన ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, కృష్ణారావు పాల్గొన్నారు.

తెలుగు సినిమా స్థాయిని పెంచిన అవార్డులు


మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నెలవారీ చిత్ర ప్రదర్శనలో భాగంగా శనివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పలు జాతీయ అవార్డులు పొందిన మల్లేశం తెలుగు సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన 69వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమాలు సత్తా చాటడం గర్వకారణమన్నారు. 69 ఏళ్లలో మొదటి సారిగా తెలుగు నటుడు అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం రావడం అభినందనీయమన్నారు. 11 అవార్డులు పొంది తెలుగు సినీ పరిశ్రమ స్థాయిని పెంచిందన్నారు. త్వరలో అవార్డులు పొందిన చిత్రాలతో రాష్ట్ర ప్రభుత్వ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, శ్రీమన్నారాయణ, అనూరాధ పాల్గొన్నారు.

తక్షణం అద్దె బకాయిలు చెల్లించాలి


ఎంవీపీ రైతుబజార్‌లో మహిళా రైతు కార్డును పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

ఆరిలోవ: రైతు బజార్లలో స్టాళ్లు నిర్వహిస్తున్న రైతులు, డ్వాక్రా మహిళలు తక్షణం అద్దె బకాయిలు చెల్లించాలని జిల్లా వాణిజ్య వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తెలిపారు. ఎంవీపీ రైతు బజార్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ షాపులు, డ్వాక్రా మహిళల కార్డులు పరిశీలించారు. కేటాయించిన స్టాళ్లలో సంబంధించిన వారే ఉన్నారా లేదా అనే దానిపై ఆరా తీసి, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇటీవల రైతు బజార్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కిలో రూ.46 బియ్యం, కిలో రూ.137 కందిపప్పు స్టాళ్లను సందర్శించారు. ఆయా స్టాళ్లలో నిల్వ ఉన్న సరకుల స్టాక్‌పై ఆరా తీశారు. ఎంత మందికి విక్రయాలు జరిగాయో రికార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి పడిన వారి స్టాళ్లను నిలిపేయాలని ఎస్టేట్ ఆఫీసర్ జి.ప్రసాద్‌ను ఆదేశించారు. ప్రతి నెలా 10వ తేదీ నాటికి అద్దెలు చెల్లించాలన్నారు. ఇక్కడ ఉన్న అనకాపల్లి జిల్లాకు చెందిన రైతులకు సంబంధించిన వెరిఫికేషన్ కార్డులు ఇంత వరకు విశాఖ మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి అందలేదన్నారు. జిల్లా ఉద్యానవనాధికారిని సంప్రదించి వెంటనే కార్డులు పంపించాలన్నారు. లేదంటే వారి కార్డులు రెన్యువల్ చేయడానికి వీలుపడదన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి


నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మేరీ మట్టి మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా కార్గిల్ విజయోత్సవాన్ని స్మరించుకుంటూ వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. సాగరతీరంలోని విక్టరీ ఎట్ సీ వద్ద శనివారం ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నాటిక, ఫ్లాష్ మాబ్ ప్రదర్శించారు. కార్గిల్ వీరుల త్యాగాన్ని మ నసం చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో వారి జీవన విధానాన్ని, త్యాగాలను తెలియజేసేందుకు ఈ కార్యక్ర మం నిర్వహించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ పి.విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు సీతామాణిక్యం, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎంవీవీకి పలువురి అభినందన


ఎంపీకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు శనివారం పలువురు లాసన్స్ బే కాలనీలోని ఆయన కార్యాలయానికి వెళ్లి అభినందనలు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీకి తెలిపారు. ఎంపీకి అభినందనలు తెలిపిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర మత్స్యకారశాఖ డైరెక్టర్ పేర్ల విజయచందర్, తూర్పు ఎస్సీ విభాగం ఇన్‌చార్జి గూడపాటి విక్టర్, విశాఖ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజుబాబు, పారిపల్లి రామారావు, సత్యాల వెంకట్, బెవర జగదీష్, మధు సంపత్ తదితరులు ఉన్నారు.

సచివాలయ కార్యదర్శులకు ట్యాబ్‌ల పంపిణీ


కార్యదర్శికి ట్యాబ్ అందజేస్తున్న జోనల్ కమిషనర్ విజయలక్ష్మి

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఏసీపీ శాస్త్రి ఆధ్వర్యంలో శనివారం టౌన్ ప్లానింగ్ విధుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. రీ సర్వేలో భాగంగా సచివాలయ కార్యదర్శులకు జెడ్పీ చేతుల మీదుగా ట్యాబ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యదర్శి ట్యాబ్ ద్వారా రీ సర్వే చేపట్టాలన్నారు. ప్రతి వార్డులో అనధికార నిర్మాణాలపై దృష్టి సారించాలని, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టీపీవో తేజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

100 శాతం ప్రవేశాలపై సర్వే జరపాలి

సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులతో డీఈవో చంద్రకళ


జోన్-2 పరిధి సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ


బోరవానిపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్-స్థూల ప్రవేశాల నిష్పత్తి) సర్వే 100 శాతం జరపాలని డీఈవో లెంక చంద్రకళ తెలిపారు. జీవీఎంసీ జోన్-2 పరిధి బోరవానిపాలెం, రాజీవ్ గృహకల్ప, జీఎస్‌వో లేఅవుట్, మారికవలస, వాంబే కాలనీ తదితర సచివాలయాలను ఆమె శనివారం సందర్శించి, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి క్లస్టర్‌లో జీఈఆర్ 100 శాతం సాధించే విధంగా కృషి చేయాలని వారికి సూచించారు. అనంతరం బోరవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. అక్కడ పాఠశాల పరిస్థితి, గదులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, పూర్తయిన సిలబస్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలకరించారు. వారి వర్క్‌బుక్స్ పరిశీలించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని, రోజూ పాఠశాలకు హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.

సంగీత కళాకారుల సేవ వెలకట్టలేనిది

సీతంపేట: సాంస్కృతిక సినీ సంగీత సంస్థ మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'నిన్ను కోరి వర్ణం' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అందరినీ అలరించింది. పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణరావు, శశిప్రభ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాయనీ గాయకులు, సంగీత వాద్య కళాకారులు కళారంగానికి చేస్తున్న సేవ వెలకట్టలేనిదని కొనియాడారు. దేశ సంస్కృతి సంప్రదాయంలో కళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా భావితరాలు వాటిని అందించవచ్చన్నారు. గాయనీ గాయకులు ఎం.ఎస్.మాధవ్, సి.హెచ్.వి.సత్యనారాయణ, సురేష్‌కుమార్, రాము, రత్నం, లక్ష్మీనారాయణ, నాగ్, అభినయ్, శైలజామెరాజ్, కందర్ప రాధ, జ్యోతి, నిహారిక, లక్ష్మీసాత్విక, రితిక పలు హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను అలరించారు. మెలోడీ క్రియేటర్స్ సంస్థ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, ఎస్.వి.విజయకృష్ణ, ఉషా చీరాల పాల్గొన్నారు.

సమ్మోహనభరితం.. సంస్కృత నృత్యోత్సవం


నృత్యంతో అలరించిన సంస్కృత కథక్ విద్యాలయం నృత్యకారిణులు

మద్దిలపాలెం: కళాకారిణుల నృత్యం సమ్మోహనపరిచింది. సంస్కృత కథక్ విద్యాలయం వార్షికోత్సవం శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ కేంద్రంగా నిర్వహిస్తున్న విద్యాలయానికి చెందిన నాట్యకారిణులు వారి నాట్య విన్యాసంతో అలరించారు. కథక్‌తో పాటు కూచిపూడి, భరతన్యాట రీతుల్లో ప్రతిభావంతమైన నృత్యంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సంస్కృత కథక్ విద్యాలయం ప్రిన్సిపాల్ క్రితా కుమారి మాట్లాడుతూ భావితరాలకు మన సంప్రదాయ నృత్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. మన సంస్కృతికి అద్దం పట్టే కథక్, భరతనాట్యం, కూచిపూడి నృత్యాల పట్ల యువత ఆకర్షితులు కావటం అభినందనీయం అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాట్య కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

విద్యా విభాగంలో మదర్ థెరిసా జయంతి


మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ టి.షారోన్‌రాజు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం విద్యా విభాగంలో శనివారం మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ దీనుల సేవకు ప్రతిరూపంగా మదర్ థెరీసా నిలుస్తారన్నారు. ఆమె సేవా భావనను ప్రతి విద్యార్థి అలవరచుకోవాలని సూచించారు. మదర్ థెరీసా నిస్వార్థంగా చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డీవీ రాము, డాక్టర్ వెనీల, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ హేమలత, డాక్టర్ సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఆంగ్ల పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆంగ్ల విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎస్. రవి విన్సెంట్ రచించిన గ్లీనింగ్స్ ఆఫ్ గేజింగ్ పుస్తకాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగం ఆచార్యులు డాక్టర్ ఎన్. సాల్మన్ బెన్నీ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ పుస్తకంలో ప్రజాస్వామ్య ఉల్లంఘన, జీవితంలో, సమాజంలోని రుగ్మతలు, సమస్యాత్మక వ్యాధులు, మూఢ నమ్మకాలు, పోలికలు- వైరుధ్యాలు, ఆశతో కూడిన దుర్భర జీవితాలు, అశాంతి, జింగోయిజం వంటి విభిన్న ఇతివృత్తాలను డాక్టర్ ఎస్. రవి విన్సెంట్ ఉద్వేగభరితంగా వివరించారు. యుద్ధ ప్రభావం, మానవ జీవితంలో వివిధ రూపాల్లో బాధలు, ప్రేమ కోసం వాంఛ, ప్రపంచంలోని అసమానతలు వంటి అనేక సమస్యలు ఈ పుస్తకంలో రచయిత చర్చించారు.

నవజాత శిశువుల చికిత్సలో అరుదైన ఘనత


మాట్లాడుతున్న డాక్టర్ మరళీ సంతోష్

బీచ్‌రోడ్డు: నవజాత శిశువుల చికిత్సలో లోటస్ ఆసుపత్రి అరుదైన ఘనత సాధించిందని ఆసుపత్రి చిన్న పిల్లల వైద్యుడు మురళీ సంతోష్ తెలిపారు. శనివారం ఒక హోటల్లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 నెలల్లో తమ ఆసుపత్రి వైద్య బృందం 26 వారాల కంటే తక్కువ వయస్సు కలిగిన వారు, అతి తక్కువ బరువు ఉన్న 16 మంది శిశువులకు విజయవంతంగా చికిత్స అందించి వంద శాతం రికవరీ రేటు సాధించినట్లు తెలిపారు. సాధారణంగా ఇటువంటి శిశువుల్లో 50 శాతం వరకు మరణాలు ఉంటాయన్నారు. కానీ వంద శాతం మనుగడ సాధించడం చాలా అరుదు అన్నారు. ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులకు అండగా ఉండి మానవతా దృక్పథంతో సేవలందించామన్నారు. 30 శాతం వరకు రాయితీ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు శిరీషరాణి, అనూష, రమ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ శాఖ ప్రారంభం


కనకమహాలక్ష్మి సహకార బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవలో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ శాఖ అందుబాటులోకి వచ్చింది. బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన ఈ శాఖను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలు తీర్చడానికి సహకార బ్యాంకులు తోడ్పడుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతంలో పేదలకు ఈ శాఖ పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరుతున్నానన్నారు. అనంతరం జిల్లా సహకార శాఖ అధికారి టి.ప్రవీణ్ మాట్లాడుతూ ఆరిలోవలో 26వ శాఖ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పన్నెండో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఆ బ్యాంక్ చైర్మన్ కె.రాంబాబు, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ సీహెచ్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ చేతన్ మహా అభియాన్‌తో ఓటు హక్కుపై చైతన్యం



ఓటు హక్కుపై ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీకాలనీ: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ చేతన మహా అభియాన్ కార్యక్రమం ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు మాట్లాడుతూ ఓటర్లలో ఓటు హక్కుపై చైతన్యం కోసం భారతీయ జనతా పార్టీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆగస్టు 25, 26 తేదీల్లో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటుతో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను ఎన్నుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర ఆర్టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, ఉమ్మడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ పాలక మండలి సభ్యుడికి అభినందన


మేకా శేషుబాబును అభినందిస్తున్న నాయకులు

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన ఏయూ పూర్వ విద్యార్థి మేకా శేషుబాబుకు రాష్ట్ర బీసీ సంఘంతో పాటు ఏయూ పూర్వవిద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన్ని పాలకొల్లులో కలిసి సత్కరించినట్లు బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు అన్ని రంగాల్లో సముచితస్థానం కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మేకా శేషుబాబును టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా సేవలందిస్తున్న బీసీ నాయకుడైన శేషుబాబుకు సముచిస్థానం కల్పించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మరిన్ని కేటాయింపులు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కె.హేమంత్‌గౌడ్, కొయ్య ఆనంద్ రత్నకుమార్, జి.రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐఏఎంలో 'కెరీర్ ఇన్ ఫిన్‌టెక్'

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కెరీర్ ఇన్ ఫిన్‌టెక్ అంశంపై శనివారం జరిగిన ఈ సదస్సులో కోహినూర్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ఆచార్య సెవట్లానా టాటూస్కర్, డాక్టర్ సుంకర రవీంద్ర, ఆచార్య సతీష్ తదితరులు పాల్గొని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. చదువుకునే దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన దిశగా కృషి చేయాలన్నారు.